# మా వంటవాడు

[కల్పితకథ]

కొప్పర్తి నారాయణమూర్తి గారు, బి.ఏ., యల్.టి. [సాహితీ సమితి]

నాకూ నాభార్యకూ అభిప్రాయ భేదం కలిగే విషయాలలోకల్లా వంట బ్రాహ్మణ్ణి కుదర్చడం అనేది ముఖ్యమైనదని చెప్పక తప్పదు. ప్రతిసందర్భములోనూ ఏకాభిప్రాయము కలిగివుంటే భార్యాభర్తలకు సంసారమంటే కొంతకాలానికి మొహం మొత్తుతుంది; తీపివస్తువులు అట్టే తినలేక పోవడమే దీనికి తార్కాణము. స్వానుభవముచేత ఈ రహస్యాన్ని కనిపెట్టిన వాడనవడంచేత నాకేమీ తోచనప్పుడు 'వంటవాడు దొరికితే మహా బాగావుండిపోను' ఇత్యాదివాక్య మొకటి నాభార్య చెవిని పడేలాగు అనేసి యేమీ యెఱుగనట్టు పడకకుర్చీలో పెడమొహం పెట్టుకొని రాబోవు ఉపన్యాసమునకు సిద్ధపడివుండేవాణ్ని. క్లబ్బులో బ్రిడ్జి ఆటకంటె వంటవాని యావశ్యకతనుగూర్చిన యుపన్యాసము ఆనందదాయకంగా వుండేది. ఇందుచేతనే క్లబ్బులో సభ్యత్వానికి కూడా రాజీనామా యిచ్చివేసినాను; సౌఖ్యమును అభివృద్ధి చేసుకొన్నాను.

మొన్న కొండపల్లి కేంపు(Camp) లో వుండగా ఒకరోజున నాభార్య తలనొప్పి చేత మూలుగుతూ పడుకున్నది. అప్పుడే పగలు పదిగంటలయింది. స్వహస్తపాకం చేసుకొనవలసివచ్చింది. పొయ్యి ముంటపెట్టడానికి కట్టెపుల్లలకోసం లేస్తూ, "వంటవాడువుంటే యీ అవస్థ పట్టకపోనుగదా!" అనుకున్నాను.

"ఇల్లు చెవికట్టుకు పోరినా మీరు విన్నారూ?"—అంది.

"వినకేం? మొన్ననే కాదూ నెల్లూరులోని నాస్నేహితునిపేర వంటవాణ్ని పంపమని వ్రాస్తే! నీకు చూపించే వుత్తరం పోస్టుకు పంపించానా!"

"ఆ, ప్రపంచకంలోకల్లా మీకాస్నేహితుడు దొరికాడు. ఎన్నివుత్తరాలు రాసినా లెక్కపెట్టడు!"

"లెక్కపెట్టక కాదు. అట్టే అవసరం లేదుగదా అని నేనే గట్టిగా పంపమని వ్రాయలేదు."

"అవసర మేమిటి యిలాంటి వాటికి? మన పొరుగింటి దివాన్ గారింట్లో యేమంత అవసరముండని వంటబ్రాహ్మణ్ణీ, వంటలక్కనీ కూడా పెట్టుకున్నారు. వారింట్లో జనం చూస్తే మొగుడు పెళ్లాము వెరసి యిద్దరు. ఇంకా ఆయనకు కాఫీ ఫలహారాలు అవసరమే లేదు. మీకు తోచకపోతే యెవరినయినా

"నాపేరు సర్వయ్య."

"అయితే బ్రాహ్మలేనా?"

"బ్రాహ్మణ్నే గాని;........"

"అనుమానిస్తావేం? నీవాలకం చూస్తే యేదో నేరస్థుడవులాగ కనిపిస్తున్నావు." అని బెదరించాను.

"కాదండి, నేను దక్షిణాదిని ఒక రింట్లో వంటచేసేవాణ్ణి. ఆరునెలలు అక్కడ పని చేసినతరువాత వాళ్లు బ్రాహ్మణులు కారని తెలిసింది;..........అయితే మొన్న నెల్లూరులో ఒక వృద్ధవితంతువు ప్రాయశ్చిత్తం చేయించుకుంటూవుండగా నేనుకూడాస్నానం చేసి తడిగావంచా కట్టుకుని ఆవిడ ప్రక్కను కూర్చుని 'మమా' అనుకొన్నాను లేండి. అంచేత ఇప్పుడు నేను బ్రాహ్మణ్ణి అనే భావించుకొనవచ్చును."

ఈగ్రంథం వినేసరికి మా స్నేహితుడు పంపిన వంటబ్రాహ్మడు ఇతడేమోయని అనుమానము, భయము, ఆశ్చర్యము ఇంకా యేవేవో కలిగి నామనస్సులో దొమ్ములాడుచున్నాయి. మరికొంత ప్రసంగములో నా యనుమానము నిజమే అని స్పష్టపడింది. ఉదయం 6 గంటలకైలుదిగి మొగం కడుక్కోడానికి ఉత్తరేణిపుల్ల కోసం వూళ్లోకి వెళ్లి తిరిగి తిరిగి అప్పటికి మాయిల్లు చేరుకున్నాడట. ఉత్తరేణిపుల్ల, లేకపోతే, ఉత్తవ్రేలు- వీటితో నేగాని ఆయన మొగం కడుక్కోడట.

ఇలాంటి బ్రాహ్మణ్ణి చేర్చడం నాకాట్టే యిష్టంలేక అనుమానిస్తూ వుండగా తాను చిన్నప్పుడు కొన్ని కావ్యాలలో కొన్నిశ్లోకాలు చదివినట్లున్నూ తరువాత పగటివేషగాండ్రలో స్త్రీవేషము వేసేవాడననీన్నీ, ఒకటి రెండుసార్లు భాగోతములో భామవేషానికి కూడా ప్రయత్నం చేసినట్లున్నూ చెప్పుకు వచ్చాడు. ఇతని వాలకంచూస్తే నాకుభయం వేసింది. కొనితెచ్చిపెట్టుకొన్న తద్దినంగా భావించి నే నెవరినో తెలియపరచి వేగంగా మడికట్టుకుని వంటచెయ్యమని చెప్పి లోపలకు తీసుకువెళ్లి "ఈయనే నెల్లూరు మిత్రుడు పంపిస్తా" అని నాభార్యకు యథావిధిగా తెలియపరచాను. ఉలికిపడి నాభార్య తిరిగిచూసి తానాశించిన సౌఖ్యమునకు ప్రారంభదశ ప్రాప్తించినదని సంతోషిస్తూ వంటింటి తలుపుగొళ్ళెం వేసి హాలులోకివచ్చి బల్లమీదనున్న పూలువుండ, పూలుకుట్టేసూదులు చేతను ధరించి మందహాసముతో నాకేసి చూసింది. వంటవాడు వచ్చాడని నాభార్య సంతోషమునకు తృప్తిపొందనా? అపాత్రుడైనవంటవాడుదొరికినందుకు విచారించనా? ఇదంతా ఒక కథకు సరిపోయే మేటరు (Matter) అవుతుందని మాత్రము ఊహించాను.

ఎలాగయితే నేం ఆ పూట సర్వయ్యశాస్త్రి వంటచేసి పుణ్యంకట్టుకున్నాడు. నాకూ నాభార్యకూ ఒక్కసారేవడ్డించాడు. నాభార్య ఉత్తరవుప్రకారం కాబోలు ప్రథమ అధ్యాయం ఉపక్రమించాను.

"ఏమయ్యా! పప్పులో ఉప్పు వెయ్యలేదేం?"

"కూరలో చూడండి"

కూర ఆరగించాను స్వల్పంగా,

"ఇది చప్పగా యేడుస్తుందేం?"

"పులుసు కొంచెము నంజుకోండి"

పులుసు నాలుకకు రాసుకునేటప్పటికి నాలిక చిల్లడిపోయింది, కళ్లంట నీళ్లు వచ్చాయి, గబగబ చెంబుడు నీళ్లూ గొంతుకలో దిమ్మరించాను. పొలమారింది, ఊపిరి సలిపిందికాదు. నాభార్య అన్నం వదలిపెట్టి లేచింది; మాచిట్టి ఏడుపు సాగించింది.

మావంటవాడు నవ్వుతూ, "నేను చెప్ప లేదూ! ఒకదాల్లో ఉప్పో కారమో తక్కువయితే మరెందులోనో అవి కొంచెం జాస్తిగా వుంటాయని" అని మరికాస్త పులుసు వడ్డించాడు. ఆత్మారాముడు ఏడవకుండా, చేసిన నాల్గుపదార్థాలు సరియైన భాగాలుగా మిశ్రమంచేసి ఉండ్రాళ్లవలె ముద్దలుచేసి కళ్లు మూసుకొని ఒక్కొక్కటే కష్టంమీద గొంతుకలో జారవిడిచాను. మాచిట్టి కేవలం మజ్జిగతోనే కడుపునిండా పట్టించింది. నాభార్య మాత్రం దొంగని తేలుకుట్టినట్టు మాట్లాడకుండా కొంతవరకు గుట్టుగా విస్తరి యెదుట పనిచేసింది.

'మేవ్ మేవ్' మని అరుస్తూ అప్పుడే వచ్చిన పిల్లికి కాస్త అన్నం వేద్దామని మాచిట్టి వంటవాణ్ణి కొంచెం అన్నంపెట్టమంది.

"ఇంక అన్నంలేదు" అన్నాడు చల్లగా.

ఆర్థికపరిస్థితుల ననుసరించి అన్నం లేదన్నాడేమో యని, "కాస్తపెట్టు, మునిగిపోలేదు" అని నేను హెచ్చరించాను. ఒట్టి అన్నం తప్పేలా తెచ్చి నాయెదుట పడేసి పెదవులు చెవులవరకు వ్యాపించునట్లు మందహాసం గావించాడు. నేను తీక్షణంగా అతని కేసి చూశాను.

"బియ్యం కొద్దిగా వున్నాయి, రేపటికి చాల్తాయో చాలవో అని కొంచెంగా పెట్టాను" అని తనచర్యను నైపుణ్యముతో సమర్థించుకొనినట్లు భావించి పొట్టమీద రెండు అరచేతులను పరచి తడుముకొన్నాడు.

అయితే, నీకేదీ అన్నం?"

"మళ్లీ వండుతాను" అన్నాడు మామూలుగా.

ఇంతట నాభోజనం ముగియడంతోనే పడకగదిలోకివెళ్లి తాంబూలం వేసుకుంటున్నాను. నాయోచనఅంతా వంటవానిమీద నే వుండడంచేత అతడేమిచేస్తున్నాడో చూడడానికి వంటయింటికేసి వెళ్లాను. తణుకులో వెదురుతడికలను వేసి వొళ్లురాచుకొను గేదెలాగు, సున్నం ఊడిపోయిన గోడభాగానికి వీపు ప్రయోగించి రాపాడుతున్నాడు, సర్వయ్య. ఇట్టే పరికిస్తినిగదా, వీపునిండా పోలీసువారి పాదరక్షల దిగువతోలుఅట్టఅంత దళసరిని అరవిందము (తామర) పూర్తిగా అంకురించడం కనిపెట్టాను.

"ఓరి నీతామర బంగారంగాను, ఇంత వుం దేమిటయ్యా!"

"ఈ తామరంతా బంగారం అయితే, ప్రజలు నన్ను బతకనిస్తారా!"

అడగండి మనయింట్లో పని యెక్కువో దివాన్ గారింట్లో పనియెక్కువో!"

"మనిషివుంటే పనివుండదా యేమిటి గాని, వృథాగా డబ్బు తగులవేసుకోవడం నాకిష్టం లేదు."

"ఇలా కూడబెట్టే కాపురం ఇంతమట్టుకు తెచ్చారు. ఉన్నవాళ్లు తిని చచ్చారా? లేనివాళ్లు పస్తుండి చచ్చారా? ఏదీ లేదు. భగవంతుడు ఏమి రాశాడో అది జరుగక మానదు. ప్రాప్తం లేకపోతే వంటినిండా వేసి లైను రాసుకొని సముద్రపు వొడ్డున దొర్లినా గానీ ఒక్క రేణువైనా అంటుకోదు. మీరెంత తెస్తే ఎందుకు? సాహేబుకు ఎంతజీతమైనా బూబుకు కుట్టుపోగులే!

"నాన్నా! తమ్ముడికి పోగులు ఇవేళ తెత్తానన్నావు, తేలేదేం?" అన్నది మాచిట్టి.

"పోగులూ లేవు బొగ్గులూ లేవు, కాస్సేపు వూరుకుందూ" అన్నాను.

"బొగ్గులు లేకపోతే కుంపటిలో పప్పు ఎలా వండుతావు?"

"నువ్వు కాస్సేపు నోరుమూసుకుందూ బతుకుతాను." అని విసుగుకుంటూ గావంచా నడుముకు గట్టిగా బిగించ బోతూవుండగా 'ఆ మూలసౌధంబునుండి' ఆరున్నొక్క-రాగం తగ్గుస్థాయీని వివిధసంగతులతో ఆలాపన వినబడింది. నాగుండెలలో రాయిపడింది. దీనికి తోడు మాచిట్టి, 'అమ్మని ఎందుకు ఏడిపించావయ్యా?' అంటూ చేతనున్న తిరుపతి చందనపు బొమ్మతో మోకాలి చిప్పమీద ఒక్కటి పెట్టింది. ప్రాణాలు కడబట్టాయి. నేలమీద చతికిల బడిపోయాను. ప్రాణం మళ్లీ చేరుకున్న తరువాత కుంటుకుంటూ వీధిగుమ్మంలోకి వెళ్లి ఎదురుగావున్న బీడీలకొట్టువాణ్ని పిలిచాను. అతను రాగానే రెండుముక్కలు ఒక కాగితముమీద రాసి 'ఈ టెలిగ్రాము అర్జంటుగా పట్టుకెళ్లి రైలు స్టేషనులో యిచ్చిరా' అన్నాను.

"టెలిగ్రాం యెవరికి?" అంది ఒక గద్గద కంఠము.

"నెల్లూరుకే!"

"ఎందుకు?"

"ఎందుకింక? వంటవాడికే! సాయంత్రానికి జవాబువస్తుంది చూడు!

"మీకున్న తొందర అవతలవారికి వుంటుందా యేమిటి?"

"జవాబుకు కూడా డబ్బు కట్టేశాను."

"అయితే జవాబు వస్తుంది, వంటవాడు లేడని!" అంటూ లేచి నేనున్న హాలులోకి వచ్చింది నాభార్య.

"అక్కడ లేకపోతే రేపు బెజవాడ వెళ్లి ఎవరినో ఒకరిని కుదిర్చి వెంటబెట్టుకు వస్తాను చూసుకో"

"ఆ! అన్నీ నిజమే!" అంటూ వంటయింట్లోకివెళ్లి వెంటనే పొయ్యి రాజవేస్తూంది.

చెయ్యి కాల్చుకోడం తప్పిందనే సంతోషంతో నేనూ పొయ్యివద్దకువెళ్లి పాక విధాన కార్యక్రమములో ఉచితరీతిని పాల్గొన్నాను.

అప్పటినుంచి అలికిడయినపుడల్లా, జ్ఞాపకంవచ్చినపుడల్లా, తీరుబడి అయినపుడల్లా ఒకసారి వీథితలుపుతీసి టెలిగ్రాంకోసం ఎదురు చూసేది నాభార్య. ఆఖరుకు సాయంత్రం 4 గంటలవేళ జవాబు వచ్చింది. నేను టెలిగ్రాం విప్పి చూస్తూవుండగా "నేను చెప్పినట్టేవచ్చిందా జవాబు?" అని అప్పుడే వేళకోళం ప్రారంభించింది.

"కాదు. ఇవాళ బయలుదేరి వస్తాడట, వంటవాడు."

"నిజంగా?"

"నిజంగా కాకపోతే అబద్ధంగా అనుకున్నావా యేమిటి?"

"అయితే యిక్కడ కెప్పుడు వస్తాడు?"

"పొద్దుటి బండిలో వస్తాడు."

"ఆరుగంటల బండిలోనా?"

"ఊఁ"

"ఊఁ యేమిటీ? సమంగా సమాధానము చెప్పలేరూ? నేనేం చెప్పినా యెప్పుడూ విసుకే మీకు" అని ఛట్టున కలహారంగము నుండి నిష్క్రమించెను.

ఆరాత్రి నిద్రలో యెట్లాగో గడిచిపోయింది. మరునాడు ఉదయం ఆరుగంటలకు పూర్వమే కాఫీ అయినదని నాభార్య నన్ను లేపినది. కాఫీ త్రాగి రైలుస్టేషను కేసి చూస్తూ కూచున్నాము. చూడగా చూడగా రైలు వచ్చింది. చాలామంది జనం దిగారు. రైలువెళ్లి పోయింది. ఎవ్వరూ మాబసవద్దకు రాలేదు. నాభార్య మొగమున ఆశాభంగము స్పష్టపడుచున్నది. వంటవాడు రాకపోవుట కేమికారణ ముండునా యని యోచిస్తున్నాము. రమారమి తొమ్మిదిగంట లయింది. ఇంక ఆరోజుకు వంటవాడు రాడని నా నిశ్చితాభిప్రాయమును సూచించాను. నాభార్య నిట్టూర్పుతో నాకు ప్రత్యుత్తర మిచ్చింది. దొండకాయ వేయిస్తేనేగాని భోజనంచెయ్యనని మాచిట్టి తీవ్రముగా ప్రకటించింది. ఆఫీసుకు పెందలకడనే వెళ్లవలసి యున్నప్పటికిని త్వరగా వంటచెయ్యమని చెప్పడానికి నాకు నోరువచ్చిందికాదు.

ఇట్టి క్లిష్టపరిస్థితులలో మా కుటుంబము లోని యావన్మంది పెనగులాడుకొనుచుండగా ఆగ్రామపుచౌకునుండివస్తూ ఒకమనిషి. మమ్మల్ని సమీపించి.

"ఈయిల్లు ఎవరిది?" అని ప్రశ్నించాడు.

"మాదే" అన్నాను. పరధ్యాన్నంగా. ఈజవాబువలన తనజీవితపు సమస్య పరిష్కరింపబడినట్టుగా గంభీరమైన మందహాసముతో "అలాగటండీ" అంటూ నాప్రక్కను కైతాయించాడు. దర్జాలో తారతమ్యము గమనించకుండా నానరసను చేరిన యీ మానవుణ్ణి కొంచెము చూడవలసివచ్చింది. తీరా చూస్తేనిగదా, తొట్టిపడవంత కడుపు, కుంభకోణంచెంబంత ముఖం,ముఖానికిసరిపడిననోరు, చెవులకు ఇత్తడివో బంగారపువో పోగులు, మోకాళ్లకు జానెడుపై కెగసియున్నగావంచా. ఇవి నాకు నవ్వుపుట్టించాయి.

"ఎవరయ్యా నువ్వు?"

"దానికేదో మందో మాకో తగలెయ్య కూడదూ? కొత్తిమిరిమడిని పెంచినట్టు పెంచుతున్నావ్!"

"ఆ ప్రయత్నం చెయ్యాలండి. కార్యం కూడా దగ్గరకు వస్తూవుంది."

"ఏం కార్యం?"

"భార్య పెద్దమనిషి అయి నాలుగేళ్లు అయింది. కార్యం చేసుకోమని మావాళ్లు చంపుతున్నారు. ఈ తామరమూలాన్ని మానుకోవలసి వచ్చింది."

"ఓరి పిడుగా! నీచరిత్ర చాలావరకు పరిశోధించవలసివుందే! ముందు వంటచేసుకో తరువాత మాట్లాడదాం" అని అతన్ని పొయ్యిదగ్గరకు ప్రోత్సాహపరచి పంపాను. నేను పచారుచేస్తూ అతని చేష్టలు పరిశీలిస్తున్నాను.

ఇదివరిలో నీళ్లుపోసి ఆరిపినకట్టెలను నాల్గుతగిలించి బుడ్డెడు కిరసనాయిలో వాటి శిరముల కభిషేకముచేసి అగ్గిపుల్లగీసి వాటికి సమర్పించాడు. సహజ వాసన వెదజల్లుచు కిరసనాయిలు ప్రజ్వలించింది. బియ్యంకడిగి పొయ్యిమీద పెట్టాడు. ఇంతటిలోకే పొయ్యిలో మంట ఆరిపోయింది. చాలా సేపు ఊదాడు, విసిరాడు; మధ్యమధ్య మంట అందుకొన్నప్పుడు శ్లోకాలు, పద్యాలు, హరికథలలో వచనాలు రాగధాటీని పఠించేవాడు. (ఈ బ్రాహ్మడికి సాహిత్యంలో కాస్త ప్రవేశం వుందని నమ్మవలసి వచ్చింది.) నాలుగయిదుసార్లు మూతతీసి చూశేడు. కొంత సేపటికి ఆగంజి వార్చి విస్తట్లో కుమ్మరించాడు. మిగిలిన పప్పు, కూర, పులుసు ఒక్కసారి వేసుకొని అన్నీ ఉడికీఉడకని బియ్యంతో కలిపేసి కమ్మవారిళ్లల్లో పెండ్లికిచేసే మినపసున్ని వుండలంత ముద్దలుచేసి బహుకష్టంతో కటుకు కటుకుమనిపిస్తూ నములుతున్నాడు. అప్పుడప్పుడు పరమశత్రువుపై కసి తీర్చుకొంటున్నట్లు బుసకొట్టేవాడు.

"ఇదేమిటయ్యా! బియ్యమే నములుతున్నావు!" అన్నాను.

"ఎంత సేపటికీ ఉడక్క నా ప్రాణాలు తీశాయి; వీటిప్రాణాలుతియ్యక నే నూరుకుంటానా? వీటికి శాస్తియింతే కావాలి!" అని శక్తికొలది కంఠం సవిరించుకున్నాడు.

"బలేవాడవురా! బాబూ;" అని ప్రఖ్యాతివహించిన వెంకటరమణయ్యగారి వెఱ్ఱినవ్వును అనుకరిస్తూ నవ్వాను.

అప్పటికప్పుడే 12 గంటలు దాటడం చేత వంటవాణ్ని విడిచిపెట్టలేకపోయినా ఆఫీసుకు పోయాను. అక్కడ పనియేమీ తోచిందికాదు. మూడుగంటలకే అరడజను స్నేహితులతో యింటికి వచ్చేశాను. వాళ్లందరినీ తివాచీమీద కూచోమని చెప్పి నేను వంటింటిదగ్గరకు వెళ్లాను.

"ఏమే! త్వరగా పదుగురికి ఫలహారం కాఫీపంపించు"

"ఫలహారం చేయలేదట."

"ఏం?" అన్నాను తీవ్రంగా సర్వయ్యకేసిచూసి.

"ఎవళ్లూ పప్పు రుబ్బలేదు. నే నేం చెయ్యను? బాణలి గంటసేపటినుంచి కాల

వేశాను; ఇంట్లో నెయ్యంతా అయిపోయింది. ఈవూళ్లో దాసీవాళ్లు చెప్పినమాట వినరు కాబోలు! దక్షిణాదిని ప్రతిపనీ వాళ్లే చేస్తారు."

"పోనీ కాఫీఅయినా ఇవతల తగలెయ్యి" అని గర్జించాను.

"కాఫీ చాలాసేపయింది కాచి; పాలు మాత్రం విరిగిపోయాయి."

ఇంకవీడితో వాదనపెట్టుకుంటే స్నేహితులలో నగుబాటనితలచి చల్లగా కాఫీహోటల్ వాణ్ని కేకవేసి ఫలహారం తెప్పించి స్నేహితులకు పెట్టాను. తమలపాకులు, చెక్కలు, బల్లమీదనుంచి అందుకుంటూ "సున్నంపట్రా సర్వయ్యా" అన్నాను, పది నిమిషాలు సర్వయ్య సున్నం పట్టుకవస్తాడని యెదురుచూశాను. స్నేహితులు వెళ్లిపోవాలని ఆత్రపడుతున్నారు. 'సర్వయ్యా' అని గట్టిగా ఒక కేకవేశాను. తోడనే రెండు చేతులతోటి సున్నపుకుండ పట్టుకువచ్చి దభేల్న తివాచీ మీద యెత్తేశాడు. కుండ పగిలింది. తివాచీ అంతా పాడయింది. స్నేహితులలో ఒకని ఆల్పాకా కోటుమీద సున్నపు బొట్లు పడ్డాయి, ఇంకొకని మెల్లకన్నులో ఇండుపకాయంత సున్నపుముద్ద అతుక్కుపోయింది. నాయందు వారికి వుండే గౌరవంచేత పైకి యేమీఅనలేకపోయారు; కాని నాకుమాత్రం వొళ్లు చచ్చిపోయింది. స్నేహితులను క్షమాపణలతో సాగనంపాను.

అయిదు గంటలయింది; మామూలు ప్రకారం గుఱ్ఱంబండివచ్చింది; నేనూ, నాభార్యా షికారుకు బయలుదేరాము; చిట్టికూడా వచ్చిందని చెప్పడం అనవసరమేకదా. బండి పదిబారలుసాగింది.

ఒకచోట పదిమంది గుమిగూడి నవ్వుతున్నారు.

"ఏమిటి, నాన్నా?" అంది చిట్టి

"దూది పెద్దపులి"

"ఈవూళ్లో వుంటాయా?"

"పీర్ల పండగలలో వేషాలు వేస్తారు. ఇదొక వేషం." అని సమాధాన పరచాను. బండి చౌకుదగ్గరకు వచ్చింది.

"ఓ! దూదిపెద్దపులి" అని చిట్టి కేకేసింది.

"ఎక్కడమ్మా?" అన్నాను.

"అడుగో!" అని చూపించింది. ఇందాక ఆల్పాకా కోటుమీద సున్నపు బొట్లు పడ్డ స్నేహితుడే! వంటవాడు వట్టిమూర్ఖుడనిన్నీ, ఇంట్లో వుండవలసినవాడు కాడనిన్నీ నాభార్యతో వాదించి ఋజువుచేసి ఒప్పించి వాణ్ని పంపించేద్దామనుకొని వాడి సంగతి కొంచెం కదిపిచూశాను.

తోడనే వినిపించుకోనట్లు

"ఈవూళ్లో దశావతారాల బొమ్మలు దొరుకుతాయిటగా!" అని విషయం మార్చేశింది. నేను చేసేదేముంది? వంటవాడి మాట తలపెట్టకూడదని అస్తమిస్తూ వున్న సూర్యబింబాన్ని చూసి వొట్టుపెట్టుకున్నాను.

షికారునుండి ఎనిమిదిగంటలకు ఇల్లుచేరుకున్నాము. మధ్యాహ్నం ఫలహారం తక్కువవడంచేతా, భోజనం తృప్తిగాలేకపోవడంచేత

మనస్సులో ఆందోళనచేతా చాలా నీరసంగా తోచింది;

"త్వరగా వడ్డించు, సర్వయ్యా" అన్నాను ఆత్రంతో.

"కట్టెపుల్లలు లేందేవ? చేతులూకాళ్లు పెట్టి వంటచేస్తాననుకొన్నారా యేమిటి?"

కాస్సేపు నన్ను నేనే తిట్టుకుంటూ పడక కుర్చీమీద పరుండి కర్తవ్యముఆలోచించాను. స్టేషనుమాస్టరుగారింట్లోనుండి నాలుగు కట్టెపుల్లలు అప్పు తెప్పించాను. వంట అయేలోపుగా ఒకనిద్దర తీయవచ్చునని క్యాంపు మంచముమీద ఇట్టే వాలిగాను.

అర్ధరాత్రి అయేటప్పటికి వంట అయిందని వంటవాడు ఘుర్ఘురించాడు.

కళ్లునుసుముకుంటూ వంటిల్లు చేరాను. విస్తరముందు కూర్చుని కందిపప్పు పచ్చడిలాగు కనబడుతూవున్న పదార్థం కలుపుకున్నాను.

"సర్వయ్యా! నెయ్యి కాస్త వెయ్యి" అన్నాను.

జవాబులేదు. ఇంకొకమాటు పిల్చాను. జవాబులేదు. నిరభికారపు అన్నమేకాస్త ఆరగించి చెయ్యికడుక్కున్నాను. ఇంతట్లో విసుగుకొంటూ గొణుగుకొంటూ సిద్ధమయినాడు, సర్వయ్య.

"ఏం? ఇంతసేపూ ఎక్కడికిపోయావు?"

"షికారు వెళ్లాననుకున్నారా యేమిటి? నెయ్యిలేకపోతే బజారుకు వెళ్లాను. వాళ్ల మొహంమండా, అన్నికొట్లు కట్టేశారు. ఒక ముండకొడుకుని, అడిగితే డబ్బుఇవ్వకుండా నెయ్యి పొయ్యనన్నాడు. ఉసూరుమంటూ వచ్చాను......"

"చాలుచాలు! తెల్లవారగట్ల బండికి ఇంటికి వెళ్లిపో, ఇప్పుడుమాకు వంటవాడు ఆట్టే అవసరంలేదు."

"నాకూ పోవాలనేవుంది; డబ్బులేక పూరుకోవలసివచ్చింది. రైలు ఎన్నిగంటలకు?"

నాకు మాట్లాడడానికి నోరుఆడింది కాదు. తాపమెత్తుతూంది. నిద్రపట్టింది కాదు. తెల్లవారగట్ల నాల్గుగంటలకు సర్వయ్యను లేపి స్టేషనుకు నడిపించాను. అక్కడ టిక్కట్టుకోసం స్టేషనుమాష్టరు గదిలోకి వెళ్లాను; సర్వయ్య వెంబడించాడు. నేనున్నూ స్టేషనుమాష్టరున్నూ జంటకవుల మాదిరిగా గుడ్ మార్నింగుతో ప్రారంభించి ఉపోద్ఘాతం సాగిస్తున్నాము.

పెద్ద పొలికేక వినిపించింది. తిరిగిచూశాము. సర్వయ్య క్రిందబడి దొర్లుతున్నాడు. కారణం తెలిసిందికాదు. సర్వయ్య పిచ్చికేకలు మొదలుపెట్టాడు. అందులో చిత్రంయేమిటంటే శుద్ధవ్యాకరణయుక్తంగా సాగించాడు-ప్రలాపన. చిన్నప్పుడు కావ్యాలు చదువుకున్నాడని యిదివరలో విన్నాను కనుక నాకు ఆట్టే ఆశ్చర్యం కలుగలేదు.

"హా! వ్యాఘ్రమా! ఎట్టి ఘోరకృత్యంబునకు సంసిద్ధతం జెందితివి. ఇదిగో! వీక్షింపుము; మదీయ............నీ శిరంబు తుత్తినియలు గావించెద, కాచికొమ్ము........" అని మూలనున్న చీపురుకట్టతీసి దానితో సాము చేస్తున్నాడు.

"ఓరి ........ ముండిపోను !" అని మనసులో అనుకొని ఇట్టే పక్కకు చూసే టప్పటికి పెద్దపులి వేషంకనబడింది. పీర్లపండగ రోజులలో చుట్టుపట్ల ప్రాళ్ళవాళ్లు కొండపల్లిలో రంగువేయించుకుని ప్రొద్దుట రైలుమీద స్వగ్రామములకు చేరుకొంటారు. ఈ పులివేషం చూడడంతోటే హడిలిపోయి మతి చెడగొట్టుకున్నాడని స్థిరపరచుకున్నాను.

ఎలాగైనా వీణ్ణి వొదుల్చుకుందామని సంకల్పముతో బెజవాడకు టిక్కట్టుతీసి సర్వయ్యను రైలుబండిలోకిత్రోసి ఆగదిలో వున్న వాళ్లకి వప్పగించాను. రైలుకదిలింది. బదుకు జీవుడాఅనుకొని ఇంటికి పోయాను.

వంటవాడు ఏమయినాడని నా భార్య నన్ను అడగనూలేదు; నేను చెప్పనూలేదు.

నాటిమొదలు నేటివరకు వంటవాడి ప్రస్తావన మాయింట్లో రావడంలేదు. ముందు మాట చెప్పలేను.

# కవిజీవితము

కే. అన్నమరాజ శర్మ గారు

కవి కుమారుండనై పుట్టు కారణమున
సతతపరిణామకాల విశాలవీథి
స్వీయజీవిత కావ్యకర్తృత్వవృత్తి,
కాలిచిన్నెల ముద్రించి కడచుచుందు.

శర్వరీస్వప్నబంధంబు సడలిపోవ
నలఁతినవ్వులు మోములం దలమికొన్న
విచ్చుమొగ్గలనైక్యమై వేగుజాము
పాడుచుందును లీల విభాతగీతి!

శ్వసనసంచాలనమున కిసాలయములు
గుసగుసలువోవ నొంటిమై కూరుచుండి
హృదయకావ్యంబు నొకమాఱు విప్పిచూతు
వింతలగు తత్ప్రబోధముల్ వినెదువేడ్క

సమయతూలిక స్వర్ణరసంబు గూర్చి
పశ్చిమాశను జిత్రముల్ వ్రాయువేళ,
స్వప్నసీమకు కుసుమగుచ్ఛములువోవ
చెప్పరానివియోగముం జెందుచుందు.

శ్యామలాకాశవీథి నిశ్శబ్దరాత్రి
గ్రాలుభావోదయము నరికట్టలేక
ప్రకృతి వినఁగల్గు కంఠనిస్వనముతోడ
స్వప్నదేశవాసులకు నుపన్యసింతు.

నరకమో త్రిదివంబో మనంబునందె
భావసంవేగమహిమచే బహుళగతులఁ
బ్రతినిమేషంబు జీవితవార్ధిఁ గనుచు
దుఃఖసమ్మదబాష్పముల్ తొలకరింతు.

"వల్లకీగానము"